# చీకటి

పరంధామయ్యను వైద్యులు అన్ని పరీక్షలు చేసి, ఆసుపత్రిలో చేర్చారని, అదికూడా పిచ్చాసుపత్రిలో అన్న వార్త విని ఆ ఊళ్లో జనమంతా మూక ఉమ్మడిగా ఆయనను చూడాటానికి పట్టణానికి తరలివచ్చారు.

పిచ్చివాడుగా జుట్టు పీక్కుంటూ, బట్టలు చింపుకుంటూ ఎదుటపడినవారితో అస్తవ్యస్తంగా మాట్లాడటం కానీ, ఏడవటం, పెద్దగా అరవడంగానీ చేస్తాడేమోనని అంతా ఆశించారు. అది చూడటంకోసమే వెళ్లారు.

వెళ్లిన వారికి నిరాశే మిగిలింది.

మనిషి శుచిగా, శుభ్రంగా ఉన్నాడు. ముఖంలో ఏదో అనిర్వచనీయమైన ఆనందం కనిపిస్తోంది. తనని చూడవచ్చినవారిని పేరుపేరునా పలకరించాడు. పెద్దలకు నమస్కారం చేశాడు. పిన్నలను ఆశీర్వదించాడు. ఎవరు పలకరించినా పెదవులపై చెరగని చిరునవ్వు.

ఆ వాలకం, ఆ తీరు చూసిన మీదట ఎటువంటివాడు ఎలా అయిపొయ్యాడని జాలిపడ్డారు.

ఇది తప్పక పిచ్చే అనే నిర్ణయానికి వచ్చారు. ఇక్కడ ఎంతకాలం ఉండాలి? అని డాక్టరిని అడిగారు. మామూలు మనిషి అయ్యేదాకా అని సమాధానం వచ్చింది.

పరంధామయ్య మంచి మోతుబరి, సంపన్నుడు. వ్యాపారంలో అదృష్టం అన్నివిధాలా కలిసివచ్చిన వ్యక్తి. చిన్నకిరాణా దుకాణంతో ప్రారంభమైన జీవితం కాలక్రమేణా ఇంతింతై వటుడింతింతై అన్న పద్ధతిలో నాలుగు లారీలు, రెండు సినిమాహాళ్లు, ఒక రైస్‌మిల్లు, స్టెయిన్‌లెస్ స్టీలు, సిమెంటు, కిరసనాయిలు కోటాలు, ఒక స్టార్‌హోటల్ మరియు అనేక లక్షల రూపాయల వడ్డీ వ్యాపారం... అంతా రాబడే తప్ప పోబడి లేదు.

దైవానుగ్రహం వలన సంతానం కూడా అన్ని విధాలా తండ్రి అడుగుజాడలలో నడవటమే- కాదు ఇకొంక మెట్టు పైకి వెళ్ళారు.నాన్నది ధర్మ వడ్డీ నెలకు రెండురూపాయలు అయితే, పిల్లల తరం వచ్చేసరికి వాళ్లే దాన్ని మూడురూపాయలకు పెంచారు.

పండితులు కానీ, యాచకులు కానీ, పేదవారు కానీ-పొరపాటున కూడా ఆ ఇంటిఛాయలకు పోయేవారు కాదు.

తెలియక ఎవరైనా వెడితే. దక్షిణ,దానం మాట ఎలా ఉన్నా, తప్పనిసరిగా సహస్రనామం, అష్టోత్తరంతో వారి నెత్తిన కుంభవృష్టి కురిసేది.

పరంధామయ్యకు వచ్చినన్ని తిట్లు మా పరగణాయే కాదు, యావత్ ఆంధ్రరాష్ట్రంలో ఎవరికీ రావండి! అది సత్యదూరం కాదు,అతిశయోక్తి కాదు.

మానవజాతికి అయిన అమూల్యమైనసందేశం"సంపాదించుకుని చావండి! ముష్టి ఎత్తుకుని బతకండి!"

నీతిచంద్రిక చదవకపోయినా పరవస్తు చిన్నయసూరిగారు చెప్పినట్టు

'మానవుడు జరామరణములు లేనివానివలె సంపాదించవలెను' అన్న వాక్యాన్ని నూటికి నూరుపాళ్లు ఆచరణలో పెట్టి నిరంతర నిర్విరామంగా శ్రమించేవ్యక్తి పరంధామయ్యగారు.

పిచ్చి ఎక్కడానికి ఎక్కడా అవకాశంగానీ, అవసరంకానీ లేని వ్యక్తి. అటువంటి వ్యక్తికి ఇలా జరిగిందంటే గాలోధూళో సోకిందనుకున్నారు. గిట్టనివాళ్లు ఎవరైనా చేతబడి చేశారేమోనని అనుమానపడ్డారు. భూతవైద్యుడిని పిలిపించాలని అనుకున్నారు.

ఇటువంటి సమయంలో పిల్లలు దగ్గర ఉండటం మంచిదని - వారి ఎరుకతోనే ఇటువంటి వైద్యం మంచిదని అందరికీ టెలిగ్రాములు, టెలిఫోనులు చేశారు. వార్త విని పిల్లలు రెక్కలు కట్టుకుని వాలారు.

తండ్రికి నయానా భయానా చెప్పిచూశారు. "ఈ పద్ధతి మన ఇంటా వంటా లేదు. మీ ధోరణి మార్చుకోండి, మామూలుగా ఉండండి" అని బతిమాలారు. "మీరు ఇట్లా ప్రవర్తిస్తే వృద్ధాప్యంలో మా అండదండలు మీకు ఉండవు" అని బెదిరించారు.

ఆయన చిరునవ్వు నవ్వి -

"ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక? ఏ దారి ఎటుపోతుందో ఎవరినీ అడగక!' ' అని సెలవిచ్చారు.

"ఏమంటున్నారు?" అని పెద్దకొడుకు అడిగారు.

ఆయన అనంతంలోకి చూస్తూ "ఋణానుబంధ రూపేణా పశుపత్ని సుతాలయ...' ' అంటూ చెప్పుకుపోతున్నాడు.

చిన్నకొడుక్కి ఆకాశమంత కోపం వచ్చింది. "ముసలివాడికి పిచ్చెక్కింది. మంచానికి కట్టేసి చింతబరికలతో మొత్తుతే కానీ ఝటాలం వదలదు!" అని అన్నాడు.

అల్లుడు వెళ్లి భూతవైద్యుని పిలుచుకుని వచ్చాడు. అతగాడు రావడం రావడం సరంజామాతో వచ్చాడు. ముగ్గులేసి పరంధామయ్యని బరిలోకి దింపాడు. రంకెలు వేశాడు. గుగ్గిలం పొగతో ఇల్లంతా నింపివేశాడు. కావలసినంత ఆర్భాటం చేశాడు.

పరంధామయ్య కళ్లలోకి చూస్తూ -

"ఎవరు నువ్వు? ఢాకినివా... పిశాచివా.... బ్రహ్మరాక్షసివా...?" అని అడిగాడు.

భూతవైద్యుడిని చూసి అందరూ భయపడుతున్నా, ఆ 'పిచ్చివాడు' మందస్మితవదనంతో "సోహం!" అని అన్నాడు.

భూతవైద్యుడు రంకెలు పెడబొబ్బలు పెట్టాడు. ఆ దృశ్యం చూస్తూ ఉంటే మంచివాళ్లకి పిచ్చి ఎక్కేట్టు ఉన్నా, ఈ పిచ్చివాడు పిచ్చివాడుగానే మిగిలిపోయాడు.

గుగ్గిలం పొగ చల్లారింది. వాతావరణం తేలిక అయింది. వేడుక చూడవచ్చిన వాళ్లంతా ఎవరి ఇంటికి వాళ్లు వెళ్లిపోయారు.

భూతవైద్యుడు, అల్లుడు మిగిలారు. దక్షిణ తాంబూలాలు పుచ్చుకుని, వెడుతూ నెమ్మదిగా "ఇంగ్లీషు వైద్యంచేయించండి!" అంటూ సలహా ఇచ్చి వెళ్లిపోయాడు.

ఇంగ్లీషు డాక్టరుగారు పరీక్షలన్నీ చేశారు. ఏ ఇష్టం లేకపోయినా, పురజనుల కోరికపై

పరంధామయ్య గారిని ఆసుపత్రిలో ఇన్‌పేషెంటుగా చేర్చుకున్నాడు.

సద్దుమణిగిన తరువాత, అసురసంధ్య వేళలో, ఎవ్వరూ లేనిసమయంలో పరంధామయ్యగారి భార్య డాక్టరుగారిని కలుసుకుని రహస్యంగా ఒక ప్రార్థన చేసింది.

" డాక్టరుగారూ! మా వారికి పిచ్చెక్కిందా? నిజం చెప్పండి!" అని అడిగింది.

ఆయన నీళ్లు నమిలాడు. తటపటాయించాడు.

"మావారికి నిజంగా పిచ్చెక్కితే, దయచేసి కుదర్చకండి! ఇలాగే ఉండనివ్వండి!" ప్రార్థించింది.

డాక్టరుగారు అటూఇటూ చూసి, ఎవ్వరూ లేరని నిర్ణయించుకుని, "మీ వారికి నేనేం వైద్యం చేయటంలేదు!"

"ఎందుకని?"

"రోగం ఉన్నవారికే మేమే వైద్యం చేసేది!" అని అన్నాడు.

ఆవిడ ఏమీ మాట్లాడలేదు. రెండుచేతులూ ఎత్తి నమస్కారం పెట్టింది. "వారిని చూడవచ్చునా?" అని అడిగింది.

"నిరభ్యంతరంగా !"

భార్యని చూడగానే పరంధామయ్య చిరునవ్వు నవ్వాడు.

ఆవిడ భర్త చేతిని తన చేతిలోకి తీసుకుని "ఇది మీకుఏ దైవం ఇచ్చిన వరం?" అని అడిగింది.

ఆయన రెండు చేతులూ జోడించి "స్వామీ చిదానందులవారు!"

రెండురోజుల తరువాత పరంధామయ్యను డాక్టరుగారు ఇంటికి పంపించివేశారు. ఆయన పిచ్చివాడు కాదనీ, పిచ్చి ఎప్పుడూ ఎక్కలేదని సర్టిఫికెట్ ఇచ్చారు.

ఆ సర్టిఫికెట్‌ను ఊళ్లోవాళ్లు నమ్మినా, కొడుకులు, అల్లుడు నమ్మలేదు.

"మీరు పెద్దవారయ్యారు, ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే! ఇహ నుంచి వ్యాపారాలు అవీ మేము చూసుకుంటాము. మీరు విశ్రాంతి తీసుకోండి!" అని గట్టిగానే సూచించారు.

"ఎంత సంపాదిస్తే మితం ఉంది? మీరు సంపాదించుకున్నది పదితరాలకు సరిపోతుంది. మీ జీవితమంతా శ్రమపడ్డారు. ఒక్కనాడూ సుఖపడలేదు. ఎంత సంపాదించినా,అంతా ఇక్కడ వదిలిపెట్టిపోవలసిందే కదా! వెంట తీసుకుని పోలేము కదా! విశ్రాంతిగా ఉందామండీ!" అని ఇల్లాలు బతిమాలింది.

ఎవ్వరూ దగ్గరలేని ఏకాంతసమయంలో, నిశివేళల పరంధామయ్య ఇల్లాలిని దగ్గరకు రమ్మని నెమ్మదిగా పిలిచాడు. సరాగానికి సరసానికి కాదు, మనసులోని మాట చెప్పుకోవడానికి.

"ఆండాళ్లూ! నీతో ఒక మాట చెబుతా. ఎవరితో చెప్పవద్దు!"

"ఎవరితోనూ చెప్పనులెండి, మీరు విషయం చెప్పండి!"

"మనం సంపాదించిన సిరిసంపదలు మన వెంట తీసుకువెళ్లడానికి ఉపాయం కనుక్కున్నాను. ఇది పరమరహస్యం!"

"ఈ రహస్యం మీకు ఎలా తెలిసింది?"

"మొన్న పట్టణం నుంచి వస్తుంటే తుఫాను ప్రారంభమైంది. వాగులు పొంగుతున్నాయి. చెట్లు విరిగి దోవకి అడ్డంగా పడుతున్నాయి. కటికచీకటి. దారీతెన్నూ తెలియడంలేదు. ముందుకి సాగలేక, వెనక్కి మళ్లలేక కారు పక్కదోవ

పట్టించి దగ్గర ఉన్న పల్లెటూరికి పోనిచ్చాను. అక్కడ కూడా పరిస్థితి ఇదే... ఒక పెద్ద ఆవరణ. దాంట్లో చక్కటి ఇల్లు. దీపాల వెలుగు కళకళలాడుతోంది. ఈ తుఫాను ప్రభావం అక్కడ అంతగా లేదు. కారు ఆ ఇంటిముందు ఆగగానే ఆ ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. 'లోపలికి రండి!' అని ఒక వ్యక్తి మా కారు దగ్గరకు వచ్చి నన్ను పిలిచాడు. ఆయన వెంట లోపలికి వెళ్లాను.

"అది స్వాములవారి ఆశ్రమం. అప్పటికే ఎందరో నాలాంటివాళ్లు అక్కడ ఉన్నారు. నన్ను స్వాములవారి దగ్గరకు తీసుకువెళ్లారు. ఆయనను చూడగానే ఎవరూ చెప్పకుండానే సాష్టాంగ నమస్కారం చేశాను. ఆయన నన్ను ఆశీర్వదిస్తూ 'పరంధామయ్యా! లే! లేచి నా పక్కన కూర్చో!' అని అన్నారు.

" నాకు అంతులేని ఆశ్చర్యం వేసి, 'స్వామీ! నా పేరు మీకు తెలుసా?' అని అడిగాను. ఆయన చిరునవ్వు నవ్వి 'నీ పేరు తెలుసు. ఈ పూట ఇక్కడకు వస్తావనీ తెలుసు!" అని అన్నారు.

"ఇంతలో శిష్యుడు వేడివేడి పాలు తీసుకునివచ్చి ఇచ్చాడు. అవి తాగగానే ప్రాణం కుదుటపడ్డది. వారి ఎదుట చేతులు కట్టుకుని కూర్చున్నారు. స్వాములవారు కళ్లు మూసుకుని ధ్యానం చేస్తున్నారు. అలా ఎంతసేపు గడిచిందో నాకు తెలియదు. కొంతో సేపటికి కన్నులు తెరిచి నా వంక చూశారు.

"పరంధామయ్యా! నీకు కాలక్షేపం ఏమిటి?" అని అడిగారు.

"ఆయన ముఖం చూస్తే అబద్ధం చెప్పబుద్ధి కాలేదు. ఆయన ఏమన్నా సేల్స్‌టాక్స్ ఆఫీసరా? ఇన్‌కమ్‌టాక్స్ మనిషా. మనకేమిటి భయం అని వారితో అంతా చెప్పేశాను. అంతటితో ఊరుకోలేదు. రెండుసార్లు కోటికి పడగెత్తాను అని గర్వంగానే మనవి చేశాను. నేను చెప్పిందంతా ఆయన శ్రద్ధగా విన్నారు. నేను చెప్పడం పూర్తి చేసిన తర్వాత ఆయన నా వంక చూసి, చిరునవ్వు నవ్వారు. 'శభాష్' అని మెచ్చుకున్నారు. పరంధామయ్యా! నువ్వు ఇంకా చాలా ఎదగాలి, ఎదుగుతావు!" అని అన్నారు.

"మీ ఆశీర్వచనం అమోఘం స్వామీ!" అని నేను అనుకుంటె, "వెళ్లేటప్పుడు ఎంత తీసుకుని వెడుతున్నావు? ఇక్కడ ఎంత విడిచి వెడతావు?" అని అడిగారు.

ఆయన ప్రశ్న నాకు అర్ధమైపోయింది కాబట్టి నేను ఎదురు ప్రశ్న వేశాను - "ఎలా సాధ్యం?" అని?

ఆయన శిష్యుడి వంక చూసి ఏదో చెప్పారు. అతను రెండుకాగితాలు తీసుకునివచ్చి నా ముందర పెట్టాడు.

"అవి చదువు!" అని స్వాములవారు అన్నారు.

వడ్డీ లెక్కలు, వ్యాపారం కాగితాలు తప్ప ఏమీ చదవటం అలవాటు లేని నాకు అవి గజిబిజిగా కనిపించాయి.

"వీటిని కంఠస్థం చెయ్యి!" అని ఆదేశించి ఆయన లోపలికి వెళ్లిపోయారు.

ఒక కాగితంలో మహావాక్యం ఒకటి ఉంది. 'మానవుడు జరామరణములు లేనివానివలె, ధనము సంపాదించవలెను. సంపాదించిన పిదప ప్రాణములు అశాశ్వతములని, శరీరము బుద్బుదప్రాయమని గ్రహించి ఆ ధనమునూ, జీవితమునూ ధర్మకార్యములకై వినియోగపరచవలెను.'

'జర' అంటే ఏమిటి అని శిష్యుడిని అడిగాను.

"వృద్ధాప్యం - ముసలితనం" అని సమాధానం వచ్చింది.

రెండో కాగితంలో ఒక చిన్న పాట ఉంది.

వస్త్రా వట్టిది. పోతా వట్టిది
ఆశ ఎందుకంట
చేసిన ధర్మముచెడని పదార్ధము
చేరును నీ వెంట!
ఆలుబిడ్డలు అన్నదమ్ములే
ఈ ప్రపంచ మాయనట
ఆగాధమైపోయేనాడు
ఎవరు రారు వెంట !
వస్త్రా వట్టిది పోతా వట్టిది
ఆశ ఎందుకంట?
చేసిన ధర్మం చెడని పదార్ధం
చేరునునీ వెంట!

ఇవి నేను కంఠస్థం చెయ్యడం పూర్తి అయ్యేసరికి లోపల, బయట చీకటి పోయి వెలుతురు వచ్చింది.

తుఫాను వెలిసి వాతావరణమంతా స్మశానమంత నిశ్శబ్దంగా ఉంది.

ఎదుట స్వాములవారు నిలబడి ఉన్నారు.

"ధర్మం అంటే ఏమిటి?" అని ప్రశ్నించాను.

"ఈ సమస్త జగత్తు నాది అనుకోవడం మాని మన అందరిదీ అని అనుకోవడం ధర్మం. అందరియందు కరుణతో,ప్రేమతో, వినయంతోప్రవర్తించడం ధర్మం! ఉన్నవారు

లేనివారిని ఆదుకోవడం ధర్మం!"

"ధర్మం చెయ్యడమంటే ఏమిటి? ఎలా?"

స్వామీజీ ఏమీ మాట్లాడలేదు. తన వెంట రమ్మని సైగ చేశారు. ఆయనతో బయటకు వచ్చాను. ఆ బీభత్స దృశ్యం చూశాను.

తుఫాను వెలిసింది. పడిపోయిన ఇళ్లు, కూలిపోయిన చెట్లు, కట్ట తెగిన చెరువులు, వరదలైన నదులు, దిక్కులేని చావు చచ్చినవేలాది జీవరాశులు... మీరంతా గుర్తుకువచ్చి, మీరంతా ఏమైపోయారోనని ఆ చచ్చిపోయినవాళ్లలో మీరు కూడా ఉన్నారేమోనని భయం వేసింది.

పసిపిల్లవాడిలాగా పెద్దపెట్టున ఏడ్చాను.

స్వామీజీ నన్ను ఓదారుస్తూ, "నీ భార్యాబిడ్డలే కాదు. వీళ్లంతా కూడా నీ కుటుంబమే!' ' అని అన్నారు.

నేను ఏదోచెప్పబోయాను... "లైన్లు బాగుపడగానే మీ ఇంటికి ఫోను చేయిస్తాను. దోవలు బాగుపడగానే ఇంటికి పంపిస్తాను. ఈ పదిరోజులూ మా దగ్గరే ఉండు! నీకు, ఇష్టం ఉంటే నలుగురికి సహాయం చెయ్యి!"

నేను ఇహ ఏమీ మాట్లాడలేదు. ఆయన సూచనని, ఆజ్ఞను శిరసావహించాను... ఆ పది రోజులూ నాకు ఎంతోకనువిప్పు కలిగించాయి.

"బ్రతకడానికి డబ్బు సంపాదించాలి. కానీ డబ్బు సంపాదించడంకోసమే బ్రతకకూడదు!"

పుణ్యాసాధన కోసమే ఈ జీవితం. నలుగురినీ సుఖపెడుతూ ప్రేమిస్తూ బతకాలి. ద్వేషిస్తూ, హింసిస్తూ కాదు. మన సిరిసంపదలు, ఇతరులకి సహాయం చెయ్యడానికే. అధికారం చెలాయించడానికి కాదు.

దానమొక్కటే మనిషిని రాక్షసుడిని కాకుండా కాపాడే మార్గం!

ఈ ఆలోచన రాగానే మనస్సు ఎంతో తేలిక అయింది. నేనెవరినో తెలుసుకున్నాను. చీకటినుంచి బయటపడ్డాను. నలుగురికోసం బతకడానికి ప్రయత్నం చేశాను.

నన్ను పశువుగా చూడటానికి అలవాటుపడ్డ ఈ జనం నన్ను మనిషిగా చూసి తట్టుకోలేక పోయారు.

అందుకనే పిచ్చివాడినన్నారు! నేను....

ఇంతకుముందు పిచ్చివాడిని... ఇప్పుడు కాదు!

ఆవిడ చిరునవ్వుగా, కొంటెగా అడిగింది, "ఇప్పుడు మీరు ఎవరు?"

"మనిషిని."

(నన్ను రచయితని చేసిన మిత్రుడు శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మగారికి అంకితం.)